ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక



**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608



సంపుటి: 2 | సంచిక: 253 | పేజీలు: 4 | వెల: రూ.3/- గురువారం 19 డిసెంబర్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్




## అమిత్ షా వ్యాఖ్యలపై కాంగ్రెస్ భగ్గు

### పార్లమెంట్ ఆవరణ ముందు అంబేడ్కర్ చిత్రాలతో నిరసన

**న్యూఢిల్లీ, డిసెంబర్ 18 (ప్రభాత ఉదయం):** కేంద్ర హోం మంత్రి అమిత్‌షా క్షమాపణలు చెప్పాలంటూ ప్రతిపక్ష కూటమి ఇండియా బ్లాక్ బుధవారం పార్లమెంట్ ఆవరణలో నిరసన చేపట్టింది. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక సహా పలువురు ఎంపిలు ఈ నిరసనలో పాల్గొన్నారు. అంబేద్కర్ చిత్రపటాలతో చేబూని, జై భీమ్, అమిత్‌షా క్షమాపణలు చెప్పాల్సిందే అంటూ నినాదాలు చేశారు. కాంగ్రెస్, వామపక్షాలతో పాటు ఆర్‌జెడి, డిఎంకె, ఆప్ పార్టీలు ఆందోళన చేపట్టాయి. మనుస్మృతిని విశ్వసించే వారు అంబేద్కర్‌తో విభేదిస్తారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే కూడా అమిత్‌షాపై విరుచుకుపడ్డారు. హోం మంత్రి బాబాసాహెబ్‌ను అవమానించడం ద్వారా బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్ జాతీయ పతాకానికి వ్యతిరేకమని, వారి పూర్వీకులు అశోక చక్రాన్ని వ్యతిరేకించారని మరోసారి రుజువైంది. భారత రాజ్యాంగానికి బదులు మనుస్మృతిని తొలిరోజు నుండే అమలు చేయాలని సంఘ్‌పరివార్ భావిస్తోందని అన్నారు. 'నాలాంటి కోట్లాది మంది ప్రజలకు అంబేద్కర్ భగవంతుడి కంటే తక్కువేమీ కాదు. దళితులు, గిరిజనులు, మైనారిటీలు, వెనుకబడిన తరగతులు , పేదలకు ఆయన ఎప్పటికీ గొప్పవాడేనని బిజెపి నేతలు అర్థం చేసుకోవాలి' ఖర్గే ఎక్స్‌లో పేర్కొన్నారు. మంగళవారం రాజ్యసభలో చర్చ నేపథ్యంలో అంబేద్కర్‌ను ప్రస్తావిస్తూ అమిత్ షా చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతోన్న సంగతి తెలిసిందే. హోంమంత్రి వ్యాఖ్యలను విపక్షాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. అంబేద్కర్ చిత్రాలు ప్రదర్శిస్తూ పార్లమెంట్ ప్రాంగణంలో ఎంపీలు నిరసన తెలిపారు. అలాగే అమిత్ షా రాజీనామాను డిమాండ్ చేశాయి. ఆ నిరసనల్లో రాహుల్ గాంధీ కూడా పాల్గొన్నారు.

# ధరణి స్థానంలో భూ భారతి



- ఇక పక్కాగా రెవెన్యూ రికార్డులు
- ప్రజలకు భరోసానిచ్చేలా కొత్త చట్టం
- ధరణి సమస్యలకు చెక్ పెట్టే విధంగా మార్పులు
- అన్ని వర్గాలతో చర్చలు..సలహాలతో కొత్త చట్టం
- గ్రామానికో రెవెన్యూ అధికారి నియామకం
- అసెంబ్లీలో కొత్త రెవెన్యూ చట్టం తెచ్చిన ప్రభుత్వం
- గత పాలకుల ధరణి మోసాలను ఎండగట్టిన పొంగులేటి

**హైదరాబాద్, డిసెంబర్ 18 (ప్రభాత ఉదయం):** ధరణిలో జరిగిన అవతవకలను అరికట్టి, రైతులకు న్యాయం చేయాలన్న సంకల్పంతోనే భూభారతిని తీసుకుని వస్తున్నామని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి తెలిపారు. భేషజాలకు పోయి 'ధరణి'ని మార్చడం లేదని.. ప్రజాసమస్యల పరిష్కారానికే ఆ పోర్టల్‌ను రద్దు చేస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన పోర్టల్ వల్ల 4 నెలలు రిజిస్ట్రేన్లు జరగలేదన్నారు. శాసనసభలో 'భూభారతి' బిల్లును పొంగులేటి ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'ధరణితో అనేక మంది ఇబ్బందులు పడిన మాట వాస్తవం. ఆ పోర్టల్‌ను బంగాళాఖాతంలో వేస్తామని హామీ ఇచ్చాం.. ఇప్పుడు వేస్తున్నాం. ధరణి స్థానంలో భూభారతిని తీసుకొస్తున్నాం. భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు లిఖితపూర్వకంగా సూచించిన అంశాలను పొందుపరిచాం. ముసాయిదా బిల్లును 40 రోజులు వెబ్‌సైట్‌లో ఉంచాం. ఎమ్మెల్యేలు, మేధావులు ఇచ్చిన అంశాలను డ్రాఫ్ట్‌లో పెట్టాం. రాష్ట్రంలోని 33 కలెక్టరేట్లలో ఒకరోజు చర్చ కూడా నిర్వహించాం. 18 రాష్ట్రాల్లో ఆర్‌ఓఆర్ చట్టాలను పరిశీలించి భూభారతి తీసుకొచ్చాం. ప్రతి గ్రామానికి ఓ రెవెన్యూ అధికారిని నియమిస్తాం. భూ వివాదాలపై అప్పీలుకు ట్రైబ్యునల్ ఏర్పాటు చేస్తాం. అనుభవదారుల కాలాన్ని కూడా ఈ కొత్త బిల్లులో పొందుపరిచాం. 33 మాడ్యూల్స్‌తో ఉన్న దాన్ని 6 మాడ్యూల్స్‌తో పునఃప్రక్షాళన చేస్తున్నాం'అని పొంగులేటి సభలో వివరించారు. తెలంగాణలో సామాన్యుల భూహక్కుల పరిరక్షణే ధ్యేయంగా 2024 ఆర్వోఆర్ – భూభారతి చట్టాన్ని రూపొందించామని పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ఇటువంటి అద్భుతచట్టాన్ని ప్రవేశపెట్టే అవకాశం తనకు లభించడం మరచిపోలేని విషయమని అన్నారు. 1971లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్వోఆర్ చట్టం 49 ఏళ్లపాటు ఉపయోగపడిందని, ముఖ్యంగా రాష్ట్ర విభజన తర్వాత కూడా ఏడేళ్ల పాటు కూడా ప్రజోపయోగంగా ఉపయుక్తమయ్యిందని తెలిపారు. తర్వాత అర్ధరాత్రి నాలుగు గోడల నడుమ రూపొందిన ధరణి చట్టం వలన సమస్యలు పరిష్కారం కాకపోగా లక్షలాది సమస్యలను తెచ్చిపెట్టిందని చెప్పారు. కొండనాలుకకు మందేస్తే ఉన్న నాలిక ఊడిందన్నట్లు ధరణి పోర్టల్‌తో లెక్కలేనన్ని ఇబ్బందులు ఎదురయ్యాయని వివరించారు. లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ, నాటి ప్రతిపక్షనేత , నేటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి , నేటి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తమ పాదయాత్రల సందర్భంగా ధరణిని సముద్రంలో కలుపుతామని ఇచ్చిన హామీని ప్రజలు విశ్వసించారని మంత్రి పొంగులేటి తెలిపారు. ఆమేరకు ఇందిరమ్మ రాజ్యాన్ని తెచ్చుకున్నారని, ఒక్క గుంట భూమి ఉన్న వారు కూడా తమను నమ్మారని, వారి నమ్మకాన్ని నిలబెట్టేందుకుగాను ..మిగతా 2లో

# అంబేడ్కర్‌ను అవమానించిందే కాంగ్రెస్

### అమిత్‌షాపై కాంగ్రెస్ విమర్శలు దారుణం.. ఎక్స్ వేదికగా మండిపడ్డ ప్రధాని మోడీ



న్యూఢిల్లీ, డిసెంబర్ 18 (ప్రభాత ఉదయం): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కేంద్ర హోం మంత్రి అమిత్ షా అవమానించారంటూ ప్రతిపక్షాలు ఆరోపిస్తున్న క్రమంలో...తాజాగా దీనిపై ప్రధాని మోదీ స్పందించారు. అంబేద్కర్ వారసత్వాన్ని తుడిచిపెట్టేందుకు షెడ్యూల్ కులాలు, తెగలను కించపరిచేందుకు కాంగ్రెస్ ఎన్ని ప్రయత్నాలు చేసిందో ప్రజలంతా చూశారని పేర్కొన్నారు. ఈమేరకు ఆయన ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. 'కొన్నేళ్ల పాటు కాంగ్రెస్ సాగించిన అరాచకాలు, ముఖ్యంగా అంబేద్కర్‌ను అవమానించిన తీరును ఇప్పుడు చెప్పే అబద్ధాలతో వారు దాచలేరు. అలా అనుకుంటే వారు పెద్ద పొరబాటు చేసినట్లే. ఎస్సీ, ఎస్టీ వర్గాలను కించపరిచేందుకు రాజవంశం నేతృత్వంలోని ఒక పార్టీ చేసిన ప్రయత్నాలను దేశ ప్రజలంతా చూశారు. మనం ఇలా ఉండటానికి అంబేద్కరే కారణం. గత ..మిగతా 2లో



## ఆటో డ్రైవర్లను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

### ఖాకీ చొక్కాలతో అసెంబ్లీకి వెళ్లిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

**హైదరాబాద్, డిసెంబర్ 18 (ప్రభాత ఉదయం):** ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలం చెందిందని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ఆటో డ్రైవర్లకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సంఘీభావం తెలిపారు. ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోరుతూ.. ఖాకీ చొక్కాలు ధరించి తెలంగాణ అసెంబ్లీకి బయల్దేరారు. ఆటో కార్మికులను ఆదుకోవాలంటూ ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నినాదాలు చేశారు. కాగా, ఈ సందర్భంగా కేటీఆర్ ..మిగతా 2లో



## సముద్రంలో ఫెర్రీని ఢీకొట్టిన స్పీడ్ బోటు

### పలువురు పర్యాటకుల గల్లంతు

### ప్రమాద సమయంలో పడవలో 66 మంది ప్రయాణికులు


### 21మందిని రక్షించిన కోస్ట్‌గార్డ్ సిబ్బంది

**ముంబై, డిసెంబర్ 18 (ప్రభాత ఉదయం):** దేశ ఆర్థిక రాజధాని ముంబైలోని గేట్‌వే ఆఫ్ ఇండియా సమీపంలోని సముద్రంలో ప్రయాణికులతో నిండిన పడవ బోల్తా పడింది. ఈ ఘటనలో బోటులో ఉన్న ప్రయాణికులంతా నీటిలో మునిగిపోయారు. సమాచారం అందుకున్న వెంటనే సహాయక బృందాలు మరో బోటులో ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాద సమయంలో బోటులో 60 మంది వరకు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఎంతమంది ఉన్నారనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. ప్రస్తుతం వారిని రక్షించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని పోలీసులు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే కొంత మందిని రక్షించారు. ఒకరు మృతి చెందినట్లు సమాచారం. ముంబై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ పడవ గేట్‌వే ఆఫ్ ఇండియా నుంచి ఎలిఫెంటా వైపు ..మిగతా 2లో

## గజ..గజ..

### సింగిల్ డిజిట్‌కే పడిపోయిన ఉష్ణోగ్రతలు

### వణుకుతున్న ప్రజలు



**హైదరాబాద్, డిసెంబర్ 18 (ప్రభాత ఉదయం):** రాష్ట్రంలో చలి తీవ్రత మరింత పెరిగింది. పలు ప్రాంతాల్లో సింగిల్ డిజిట్‌కే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సాయంత్రం 5 గంటల నుంచే చలి మొదలై.. ఉదయం 10 గంటల దాకా చలి తగ్గకపోవడంతో ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే జనం గజగజ వణికిపోతున్నారు. మంగళవారం రాత్రి రాష్ట్రవ్యాప్తంగా అన్నిచోట్ల సాధారణం కంటే 3 డిగ్రీలు తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యల్పంగా హైదరాబాద్‌లో 6.2 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. పటాన్‌చెరులో 7డిగ్రీలు, మెదక్‌లో 7.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హైదరాబాద్‌లో 11.9 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. శీతలగాలుల నేపథ్యంలో ఇప్పటికే ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు. రానున్న రెండు రోజుల్లో చలి తీవ్రత మరింత అధికంగా ఉండే అవకాశం ఉందని హెచ్చరించారు.

## లగచర్ల దాడి కేసులో ఊరట

### నిందితులకు బెయిల్ మంజూరు

హైదరాబాద్, డిసెంబర్ 18 (ప్రభాత ఉదయం): లగచర్లలో అధికారులపై దాడి కేసులో నిందితులందరికీ నాంపల్లి ప్రత్యేక న్యాయస్థానం బెయిల్‌ను మంజూరు చేసింది. పట్నం నరేందర్ రెడ్డితో పాటు సురేష్, మిగతా నిందితులు అందరికీ బెయిల్ మంజూరు చేస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. పట్నం నరేందర్ రెడ్డి రెండు ..మిగతా 2లో





## ఆటో కార్మికులకు బిఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుంది

### ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రావు

కూకట్‌పల్లి,డిసెంబర్ 18 (ప్రభాత ఉదయం) బిఆర్ఎస్ పార్టీ ఆటో కార్మికులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రావు అన్నారు. ఆటో కార్మికులు పట్ల రేవంత్ రెడ్డి సర్కార్ తీసుకున్న వ్యతిరేక నిర్ణయాల వల్ల మా ఉపాధికి గండిపడుతుందని తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా వారికి మద్దతు తెలుపుతూ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ కూకట్ పల్లి లోని ఆటో కార్మికులును కలిసి బిఆర్ఎస్ పార్టీ ఎప్పుడు మీకు అండగా ఉంటుందని సమస్యలపై కచ్చితంగా పోరాడుతామని వారికి హామీ ఇచ్చారు.

## ఆటో డ్రైవర్లను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

మొదటి పేజీ తరువాయి...

మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లను ఆదుకోవడంలో ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు 93 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడ్డారని తెలిపారు. గత అసెంబ్లీ సమావేశాల్లోనే ఆత్మహత్య చేసుకున్న ఆటో డ్రైవర్ల జాబితాను ఇచ్చామని పేర్కొన్నారు. అయినా రాష్ట్ర ప్రభుత్వానికి దున్నపోతు మీద వాన పడ్డట్టే ఉందని అన్నారు. ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి ఇస్తామన్న 12వేల రూపాయలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లు ఎవరూ ఆత్మహత్యలకు పాల్పడవద్దని.. బీఆర్ఎస్ పక్షాన వారికోసం పోరాడతామని స్పష్టం చేశారు. ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలు, వారికి ఇచ్చిన హామీలపై అసెంబ్లీలో చర్చించాలని ఇప్పటికే బీఆర్ఎస్ వాయిదా తీర్మానం ఇచ్చింది. ప్రభుత్వ ముందుచూపు లేని విధానాల వల్ల రాష్ట్రంలో ఆటో డ్రైవర్లు ఉపాధి అవకాశాలు కోల్పోయి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ తమ వాయిదా తీర్మానంలో పేర్కొంది. కాబట్టి ఆత్మహత్య చేసుకున్న ఆటో డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేసింది. ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా ప్రతి ఆటోడ్రైవర్‌కు ఏటా 12వేల రూపాయలు ఆర్థిక సాయం అందించాలని పేర్కొంది. అలాగే ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ.. దీనిపై అసెంబ్లీలో చర్చించాలని ప్రతిపాదించింది.



## సముద్రంలో ఫెర్రీని ఢీకొట్టిన స్పీడ్ బోటు

మొదటి పేజీ తరువాయి...

వెళుతోంది. బుధవారం(డిసెంబర్ 18) మధ్యాహ్నం ఈ ఘటన జరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఆ సమయంలో అస్పష్టమైన వాతావరణం కారణంగా, పెద్ద సంఖ్యలో పర్యాటకులు గేట్‌వే ఆఫ్ ఇండియాకు చేరుకున్నారు. వీరిలో చాలా మంది బోటింగ్‌కు కూడా సముద్రంలోకి వెళ్లారు. కొందరు పర్యాటకులు స్పీడ్ బోటులో ఎలిఫెంటా వైపు వెళ్తున్నారని ప్రత్యక్ష సాక్షి ఒకరు తెలిపారు. వారి పడవ ఒడ్డు నుంచి 50 మీటర్ల లోపలికి వెళ్లగానే ఒక్కసారిగా ఏదో జరిగి మునిగిపోవడం ప్రారంభించింది. యాదృచ్ఛికంగా, ఒక పెద్ద పడవ అక్కడికి చేరుకుంది. మునిగిపోతున్న పడవ నుండి కొంతమంది ప్రయాణికులను పెద్ద పడవలోకి తీసుకువెళ్లారు. ముంబై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, సమాచారం అందుకున్న వెంటనే, అనేక ఇతర బోట్లతో సహాయక బృందాలు సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. ప్రమాదంలో ఒకరి మృతి చెందగా, 21 మందిని కోస్ట్‌గార్డ్ రక్షించింది. మిగిలి ప్రయాణీకులను రక్షించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ప్రమాద సమయంలో పడవలో 66 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, బోటులో ఎంతమంది ప్రయాణికులు ఉన్నారనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసు అధికారులు గల్లంతైన వారి ఆచూకీ కోసం మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం డైవర్ల బృందాన్ని సముద్రంలోకి దింపారు.

## మరో ఉచిత హామీకి ఆప్ హామీ

### సీనియర్ సిటిజన్లకు ఉచిత వైద్య సేవలు అందిస్తాం

### ఎన్నికల ముందు ఆప్ అధినేత కేజ్రీవాల్ ప్రకటన



న్యూఢిల్లీ, డిసెంబర్ 19 (ప్రభాత ఉదయం): ఇప్పటికే అనేక ఉచిత హామీలతో అదరగొడుతున్న ఆప్ అధినేత కేజ్రీవాల్ మరో హామీ గుప్పించారు. వచ్చే ఏడాది ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ ఆప్ కీలక హామీ ప్రకటించింది. ఢిల్లీలోని సీనియర్ సిటిజన్లు అందరికి అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం అందిస్తామని హామీ ఇచ్చింది. మరోసారి ఆప్ అధికారంలోకి వస్తే 60 ఏళ్లు దాటిన వృద్ధులందరికీ ఉచిత వైద్యం అందించేలా 'సంజీవని యోజన' అమలు చేస్తామని ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ తెలిపారు. 'వయో వృద్ధుల సంరక్షణ మా బాధ్యత. మీరెంతో కష్టపడి పనిచేసి దేశాన్ని ముందుకు తీసుకొచ్చారు' అన్నారు. సీనియర్ సిటిజన్లు అనారోగ్యానికి గురైతే వారి చికిత్సకు అయ్యే ఖర్చుకు గరిష్ఠ పరిమితి ఏమీ ఉండదని కేజ్రీవాల్ తెలిపారు. దీనిపై ఒకట్రెండు రోజుల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదల వుతుందని.. ఆప్ కార్యకర్తలే ఇళ్లకు వచ్చి రిజిస్ట్రేషన్ చేస్తారన్నారు. వారు ఇచ్చే కార్డును జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు. వచ్చే ఏడాది జరిగే ఎన్నికల్లో తాము అధికారంలోకి రాగానే.. ఈ ఉచిత చికిత్స విధానాన్ని అమలు చేస్తామన్నారు. మరోవైపు, ఢిల్లీ ఎన్నికల సన్నద్ధతపై సమీక్షించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఈ వారంలోనే సమావేశం నిర్వహించనుంది. ఈ క్రమంలో త్వరలోనే ఎన్నికల తేదీలను ప్రకటించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే ఆప్ 70 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఆప్ చీఫ్ కేజ్రీవాల్ న్యూఢిల్లీ నుంచి పోటీ చేయనున్నారు.. సీఎం ఆతిశీ కల్కాజీ సీటు నుంచి బరిలో నిలవనున్నారు.

# ధరణి స్థానంలో భూ భారతి

మొదటి పేజీ తరువాయి...

ఆర్వోఆర్ 2020ను పూర్తిగా ప్రక్షాళన చేసి భూభారతిని రూపొందించామని చెప్పారు. తాము ఆగస్టు 2న ముసాయిదాను ప్రవేశపెట్టడమేగాక ప్రత్యేకంగా 40 రోజుల పాటు వెబ్ సైట్‌లో పెట్టి ప్రజాప్రతినిధులు,కవులు , మేధావులు, విశ్రాంత అధికారుల సలహాలు సూచనలు స్వీకరించి కొత్త చట్టానికి రూపకల్పన చేశామని తెలిపారు. మాజీ మంత్రి హరీష్ రావు 7 పేజీలు, వినోద్‌రావు 5 పేజీల సలహాలు . సూచనలు చేశారని వాటిని కూడా పరిగణనలోకి తీసుకున్నామని మంత్రి పొంగులేటి తెలిపారు. 33 జిల్లాలలో ఒక్కోరోజు ప్రత్యేక చర్చావేదికలు నిర్వహించి అందరి అభిప్రాయాలు తీసుకున్నామని చెప్పారు. ధరణ కారణంగా ఎంతోమంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కేసముద్రం మండలం నారాయణపురంలో కె. రవి అనే ఎంపీటీసీ సభ్యులు భూ సమస్లలను బిఆర్ఎస్ ప్రభుత్వ పెద్దలందరి దృష్టికి తీసుకువెళ్లారని , ఏళ్ల తరబడి పరిష్కారం కాలేదని చెప్పారు. అంతేగాక సర్వేనెంబర్లు 149,150, 154,156, 168 తదతరాల్లోని 1398 ఎకరాల భూమి తరతరాలుగా అక్కడి గిరిజనుల సాగుబడిలో ఉన్నాయని మంత్రి పొంగులేటి తెలిపారు. ధరణి -2020 ఆర్వోఆర్ చట్టం వచ్చాక వారి హక్కులకు భంగం వాటిల్లేలా సదరు భూములు అటవీ భూములని తేల్చిచెప్పారని దీంతో గిరిజనులు తీవ్ర మనోవేదనకు గురయ్యారని మంత్రి వివరించారు. భూభారతి బిల్లుకు సంబంధించి 22-23 సార్లు అభిప్రాయాలు తీసుకున్నామని, అందువల్లే బిల్లు ప్రవేశపెట్టడంలో .జాప్యం జరిగిందని మంత్రి పొంగులేటి చెప్పారు. ప్రజలకు పూర్తిస్థాయిలో ఉపయోగ పడేలా బిల్లు తయారుచేసేందుకు కృషి చేశామని, సాదాసీదా బిల్లును ప్రజలపై రుద్దే ఆలోచన తమ ప్రభుత్వానికి లేదని మంత్రి స్పష్టం చేశారు. భూమి చుట్టూ మనిషి జీవితం ముడిపడి ఉంటుంది. తరతరాలుగా మనిషి జీవితానికి, భూమికి విడదీయరాని అనుబంధం ఉంది. భూమి పేదరికాన్ని దూరం చేస్తుంది. ఆత్మగౌరవంతో బతికే అవకాశాన్ని ఇస్తుంది. కష్టానికి తగిన ప్రతిఫలాన్ని ఇస్తుంది. గ్రామాల్లో భూమే ప్రధాన జీవనాధారం. భూమిని నమ్ముకుని బతికే కష్టజీవులను కంటికి రెప్పలా చూసుకునే బాధ్యత ప్రభుత్వాలది. కానీ గత ప్రభుత్వం దీన్ని విస్మరించింది. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 1971లో తీసుకొచ్చిన ఆర్వోఆర్ చట్టం 49 ఏండ్లు విజయవంతంగా అమలైంది. ప్రజల అవసరాలే లక్ష్యంగా అసైన్డ్ లాండ్స్ మొదలు అనేక విధాన నిర్ణయాలను గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందని వివరించారు. కాంగ్రెస్ అంటేనే ప్రజలకు ఒక భద్రత, భరోసా. అందుకే ఇప్పటికీ ఇందిరమ్మను ప్రజలు గుండెల్లో పెట్టుకుంటున్నారు. ధరణి కారణంగా భూ యజమానికి తెలియకుండానే చేతులు దాటిపోయేలా




చేసింది. కాళ్ళకింద నేల కదిలిపోయినా పేదలు వారి ఆవేదనను చెప్పుకోడానికీ మార్గం లేకుండా చేసింది. ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మా సీఎం రేవంత్‌రెడ్డి గారి సూచన మేరకు ధరణి కష్టాలను తెలుసుకుని వాటి పరిష్కారానికి భూ నిపుణులతో ఒక కమిటీని ఏర్పాటు చేశాం. రెవెన్యూ చట్టాలను ఈ కమిటీ అధ్యయనం చేసింది. ప్రజల నుంచి చట్టం రావాలనే ఉద్దేశంతో అదే రోజున సీసీఎల్ఏ వెబ్‌సైట్‌లో కూడా ముసాయిదా బిల్లును అందుబాటులో ఉంచాం. దాదాపు పాతిక రోజుల పాటు ప్రజా ప్రతినిధులు, రైతుసంఘాల ప్రతినిధులు, మేధావులు, సామాన్య ప్రజానీకం, రిటైర్డ్ అధికారుల నుంచి సలహాలు, సూచనలను స్వీకరించాం. అన్ని జిల్లాల్లో కలెక్టర్లు సదస్సులు నిర్వహించి అభిప్రాయాలను స్వీకరించారు. చివరకు 2020 చట్టంలో ప్రధాన పాత్ర పోషించిన తన్నీరు హరీశ్‌రావు, మాజీ ఎంపీ వినోద్ కుమార్ సూచనలు కూడా స్వీకరించాం. ఒక చట్టం మీద ప్రజల నుంచి అభిప్రాయాలను స్వీకరించడం రాష్ట్ర చరిత్రలో ఇదే ప్రథమం. భవిష్యత్తులో భూ వివాదాలకు తావు లేకుండా ఎంజాయ్‌మెంట్ సర్వే ద్వారా శాశ్వత పరిష్కారం చేస్తామని అన్నారు. రిజిస్ట్రేషన్ దస్తావేజుల ద్వారా వచ్చే మ్యుటేషన్ జరిగేటప్పుడు ఏవైనా తప్పులు జరిగితే అప్పీల్ చేసుకునే వ్యవస్థ (అథారిటీ)ని ఏర్పాటు చేస్తున్నాం. ఏదైనా పనికొచ్చేదున్నదంటే... రిజిస్ట్రేషన్, ఆ వెంటనే మ్యుటేషన్ జరిగే వెసులుబాటే. కానీ దురదృష్టవశాత్తూ తప్పులకు పరిష్కారం చూపే వ్యవస్థే లేదు. సేల్ డీడ్, వారసత్వం ... కాక కోర్టు ద్వారా వచ్చే, ఓఆర్సీ, 38-ఈ తదితర మొత్తం 14 రకాల భూమి హక్కులపై మ్యుటేషన్ పవర్స్ ను ఆర్డీవో . సాదా బైనామా ... : 2020 నవంబరు 10 వరకు ఆన్‌లైన్‌లో వచ్చిన సుమారు 9.24 లక్షల దరఖాస్తులకు పరిష్కారం...చూపుతామని అన్నారు. దేశంలో ప్రతీ పౌరుడికి ఆధార్ నెంబర్ ఎలా ఉంటుందో మన రాష్ట్రంలో భూములకూ భూధార్ నంబర్...తెస్తామని అన్నారు. 2014కు ముందు రెవెన్యూ రికార్డుల నిర్వహణ, జమాబందీ ఎలా ఉండేదో ఇకపైనా అదే విధంగా కొనసాగిస్తాం.

త్వరలోనే ప్రతీ రెవెన్యూ గ్రామానికి ఒక అధికారిని నియమిస్తాం. గత ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను భ్రష్టు పట్టించింది.

భూ వివాదాల గ్రీవెన్స్, అప్పీళ్ళ కోసం లాండ్ ట్రిబ్యునల్స్ ఏర్పాటు... అవసరాన్ని, ప్రాంతాన్ని బట్టి సంఖ్యపై ప్రభుత్వ నిర్ణయం...ఉంటుందన్నారు. ప్రభుత్వ ఆస్తుల్ని, రికార్డుల్ని ఉద్దేశపూర్వకంగా ఎవరైనా తారుమారు చేస్తే సీసీఎల్ఏ ద్వారా రివిజన్ చేసుకునే ఆప్షన్ ను ఈ చట్టంలో పొందుపరుస్తున్నాం.

ప్రభుత్వ అధికారులపై చర్యలు: ప్రభుత్వ ఆస్తుల్ని ఉద్దేశపూర్వకంగా తారుమారు చేసే అధికారులపై చర్యలు తీసుకుని శిక్షించే అధికారాన్ని ఈ చట్టం ద్వారా తీసుకొస్తున్నాం అన్నారు. 2014 కి ముందు పాస్ బుక్కులు కలిగి ఉంది అనుభవదారుడిగా పొసిషన్ లో ఉన్న వారు ధరణి తరువాత రోడ్డున పడ్డారు. గత ప్రభుత్వం ఈ అంశాన్ని పూర్తిగా విస్మరించింది. భూ భారతిలో పట్టాదారులు, అనుభవదారులు అభద్రతాభావానికి గురి కావాల్సిన అవసరం లేదు. ఈ చట్టం వీరికి సముచిత స్థానం కల్పిస్తాం.

రెవెన్యూ రికార్డులు టాంపరింగ్ జరగకుండా కంప్యూటర్ రికార్డులతో పాటు నిర్ణీత కాల వ్యవధిలో మాన్యువల్ కాపీని కూడా రెవెన్యూ కార్యాలయాలలో భద్రపరుస్తాం అన్నారు. గత ప్రభుత్వం కొన్ని వివరాలను బహిర్గతం కాకుండా లాకర్లలో బంధించింది. ఇప్పుడు భూ-భారతితో ఎవరైనా ఎక్కడి నుంచైనా చూసుకునేలా డిస్‌ప్లే చేస్తున్నాం. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతానికి గురికాకుండా ఎవరైనా భూ భారతి ద్వారా ప్రభుత్వానికి తెలియ చేయవచ్చు. ఆ భూముల్ని పరిరక్షించేలా ఈ చట్టాన్ని రూపొందిస్తున్నాం.

భూ-భారతిలో దరఖాస్తు చేసుకున్న భూములున్న ఆసాములకు వారి మొబైల్ నెంబర్లకే అప్‌డేట్స్ వెళ్ళే సౌకర్యాన్ని కల్పిస్తున్నాం. గతంలో ధరణి కారణంగా అన్యాక్రాంతమైన భూముల వివరాలను భూ భారతి ద్వారా బట్టబయలు చేస్తాం. 2014కు ముందు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల దగ్గర ఉన్న ప్రభుత్వ భూముల జాబితాలోని రెవెన్యూ, ఎండోమెంట్, వక్ఫ్, భూదాన్, ఫారెస్ట్ తదితర భూముల వివరాలను ధరణిలోని డేటాతో పోల్చి చూసి అన్యాక్రాంతమైన భూముల వివరాలను బహిర్గతం చేస్తాం. ప్రభుత్వ భూముల్ని ఆక్రమించినవారు ఎంత పెద్దవారైనా వదిలేది లేదు. ఆ భూముల్ని తిరిగి స్వాధీనం చేసుకుని పేదలకు పంచుతాం. రూల్స్ ఫ్రేమ్ అయిన తర్వాత గ్రామ స్థాయిలో రెవెన్యూ సదస్సులు పెట్టి అధికారులతో పాటు నేను, సహచర ప్రజా ప్రతినిధులతో కలిసి పరిష్కారాన్ని యుద్ధ ప్రాతిపదికన కనుగొంటాం.రికీ ఆమోదయోగ్యంగా తీసుకొస్తున్న భూ-భారతి చట్టం కనీసం వందేళ్ళు వర్ధిల్లుతుందని ఈ ప్రభుత్వం బలంగా నమ్ముతున్నదని మంత్రి వివరించారు.

## అసెంబ్లీ ముందు డ్రంకన్‌డ్రైవ్ టెస్టులు పెట్టాలి: హరీశ్‌రావు

హైదరాబాద్, డిసెంబర్ 19 (ప్రభాత ఉదయం): గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అసెంబ్లీలోకి వచ్చే సభ్యులకు డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహించాలని హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. మామ చాటు అల్లుడిగా రూ. పదివేల కోట్లు దోచుకున్న దొంగ హరీష్ రావు అని.. ఆ అవినీతిని మేము నిరూపిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఈ వ్యాఖ్యలపై హరీశ్‌రావు ఘాటుగా స్పందించారు. సభ్యులపై ఆరోపణలు చేయొద్దని శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు రూలింగ్ బుక్ చూపించి చెప్పారని హరీశ్‌రావు గుర్తు చేశారు. సుద్దులు మాకు చెప్పడం కాదు వారి సహచర మంత్రికి కూడా చెప్పాలి.. వెంకట్ రెడ్డి కమీషన్ లిస్టు చదవమంటే నేను చదువుతాను అని హరీశ్‌రావు పేర్కొన్నారు. కొంతమంది సభ్యులు డ్రింక్ చేసి సభకు వస్తున్నారని, సభలోకి వచ్చి ఏం మాట్లాడుతున్నారో వారికే తెలియడం లేదని అన్నారు. అసెంబ్లీ బయట డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు పెట్టాలని హరీష్ రావు సూచించారు.



## 75 ఏళ్ళ పాటు కష్టపడి కాంగ్రెస్ పార్టీ దేశ ప్రతిష్టను పెంచింది



### ఆదానీపై అమెరికాలో కేసులు నమోదైతే ప్రధాని మోడీ ఎందుకు మౌనంగా ఉన్నారు

### ఆదానీ, ప్రధాని బంధం దేశం మొత్తానికి తెలుసు

### దేశ సంపదను అదానీకి దోచిపెడుతున్నారు

### టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం

కూకట్‌పల్లి,డిసెంబర్ 18 (ప్రభాత ఉదయం) దేశ ప్రతిష్టను దెబ్బతీసేలా గౌతమ్ అదాని ఆర్థిక అవకతవకలు, అవినీతి ఆరోపణలు, మణిపూర్ లో అల్లర్లపై మోడీ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఏఐసీసీ పిలుపుమేరకు టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఛలో రాజ్ భవన్ కార్యక్రమంలో భాగంగా నెక్లెస్ రోడ్లోని ఇందిరా గాంధీ విగ్రహం వద్ద కూకట్ పల్లి నియోజకవర్గ ఇంచార్జి బండి రమేష్, టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం, బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు నిరసన వ్యక్తం చేసి రాజ్ భవన్ వరకు నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ అవినీతి ద్వారా దేశ ఆస్తులని ఆదానీ కొల్లగొట్టారని, ఆయనను వెంటనే అరెస్టు చేసి విచారిస్తే విషయాలన్నీ బయటపడతాయని, కానీ, భారత్ లో అరెస్ట్ కాదని ఆయనపై విచారణ జరగదని ఎందుకంటే ఆయన్ని మోడీ కాపాడుతున్నాడని అన్నారు. ఆదానీపై అమెరికా లో కేసులు నమోదైతే ప్రధాని మోడీ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. ఆయన మౌనం వీడకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామన్నారు. 75 ఏళ్ళ పాటు కష్టపడి కాంగ్రెస్ పార్టీ దేశ ప్రతిష్టను పెంచిందని అన్నారు. కానీ ఆదానీ ప్రధాని ఇద్దరూ కలిసి దేశం పరువు తీశారని మండిపడ్డారు. వ్యాపారం చేసేందుకు ఆదానీ లంచాలు ఇచ్చారని అమెరికా సంస్థలు తేల్చాయని చెప్పారు. అసలు ఆదానీని కాపాడడానికి ఎవరు ప్రయత్నిస్తున్నారో ముందు ఆ విషయం తేలాలని అన్నారు. అదానీ గ్రూప్ కంపెనీల కార్యకలాపాలు, విదేశాల్లో పెట్టుబడులపై జాయింట్ పార్లమెంట్ కమిటీ (జెపీసీ) తో విచారణ జరిపించాలని, పారిశ్రామిక రంగంలో ఇలాంటి అనైతిక బంధాలకు, విధానాలకు కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచీ వ్యతిరేకమన్నారు. పీఎం మోదీ, అదానీ బంధం దేశం మొత్తానికి తెలుసని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు, మహిళా డివిజన్ అధ్యక్షురాళ్లు, మహిళలు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అంబేడ్కర్‌ను అవమానించిందే కాంగెస్ర్

మొదటి పేజీ తరువాయి...

దశాబ్దకాలంగా ఆయన ఆశయాన్ని నెరవేర్చేందుకు మా ప్రభుత్వం అవిశ్రాంతంగా కృషి చేసింది. 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకొచ్చాం. ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని బలోపేతం చేయడం, స్వచ్ఛ భారత్, పీఎం ఆవాస్ యోజన వంటి ప్రధాన కార్యక్రమాలు ప్రతిఒక్కరికీ ఉపయోగపడ్డాయి. అంబేద్కర్‌తో అనుబంధం ఉన్న ఐదు ప్రసిద్ధ ప్రదేశాలైన పంచతీర్థాన్ని అభివృద్ధి చేసేందుకు మా ప్రభుత్వమే కృషి చేసింది. దశాబ్దాలుగా చైత్య భూమికి సంబంధించిన పెండింగ్ లో ఉన్న భూ సమస్యను మా ప్రభుత్వమే పరిష్కరించింది. నేను అక్కడ ప్రార్థనకు వెళ్లాను. అంబేద్కర్ తన చివరి ఏడాదిలో గడిపిన ఢిల్లీలోని 26 అలీపూర్ రోడ్డును మేము అభివృద్ధి చేశాం. లండన్ లో ఆయన నివసించిన ఇంటిని మా ప్రభుత్వమే కొనుగోలు చేసింది. ఆయన్ను సంపూర్ణంగా గౌరవిస్తుంది మేమే. పార్లమెంటులో హోంమంత్రి అమిత్ షా మాట్లాడి కాంగ్రెస్ చీకటి చరిత్రను బయటపెట్టారు. ఆయన మాట్లాడిన వాస్తవాలను చూసి వారు సైతం ఉలిక్కిపడటంతో పాటు ఆశ్చర్యపోయారు. అందుకే ఇప్పుడు వారు నాటకాలాడుతున్నారు. కానీ, ప్రజలకు నిజం తెలుసు' అని మోదీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పార్లమెంటులో షా మాట్లాడిన వీడియోను ఆయన పంచుకున్నారు. రాజ్యసభలో రాజ్యాంగంపై చర్చ సందర్భంగా మాట్లాడిన అమిత్ షా అంబేద్కర్ ను ఉద్దేశిస్తూ పలు వ్యాఖ్యలు చేశారు. దీనిపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. షా దళితులను అవమానించారంటూ కాంగ్రెస్ దాని మిత్రపక్షాలు ఆరోపించారు. బుధవారం పార్లమెంటు ఆవరణలో అంబేద్కర్ ఫొటో పట్టుకొని నిరసన తెలిపారు. ఆయన హోంమంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశాయి.

## లగచర్ల దాడి కేసులో ఊరట

మొదటి పేజీ తరువాయి...

50 వేల ష్యూరిటీలు, మిగతా వారు 20 వేల పూచీకత్తు సమర్పించాలని కోర్టు ఆదేశించింది. మూడు నెలల పాటు ప్రతి బుధవారం పోలీసుల ముందు విచారణ హాజరుకావాలని పట్నం నరేందర్ రెడ్డికి ఆదేశాలు జారీ చేసింది. వికారాబాద్ జిల్లా లగచర్లలో ఫార్మా కంపెనీ స్థాపనపై ప్రజాభిప్రాయ సేకరణ కోసం వెళ్లిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ , ఇతర రెవెన్యూ అధికారులపై స్థానికుల దాడి జరిగింది. ఈ దాడిలో అధికారులు ప్రయాణిస్తున్న వాహనాలను రాళ్లతో ధ్వంసం చేశారు. ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన అధికారులపై దాడి జరగడంతో రాష్ట్ర రాజకీయాల్లో కలకలం రేపింది. కాంగ్రెస్ పార్టీ ఈ ఘటన వెనుక బీఆర్ఎస్ పార్టీ హస్తం ఉందని ఆరోపించింది. స్థానికులను రెచ్చగొట్టి అధికారులపై దాడి చేయించారని కాంగ్రెస్ విమర్శలు చేసింది. బీఆర్ఎస్ నేతల ఆదేశాల మేరకు కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి తన అనుచరుడు భోగమోని సురేష్‌తో కలిసి ఈ దాడి పాన్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

# ఫుట్ పాత్‌లను ఆక్రమిస్తే కఠిన చర్యలు

## ఫుట్ పాత్ ఆక్రమణల తొలగింపులో రచ్చ..

రాజేంద్రనగర్,డిసెంబర్ 18(ప్రభాత ఉదయం) ప్రజల సౌకర్యార్థం నిర్మించిన ఫుట్పాత్లను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే వాటిని గుర్తించి కూల్చివేయడం జరుగుతుందని రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కే.రవికుమార్ సూచించారు. రాజేంద్రనగర్ జిహెచ్ఎంసి అధికారులు రోడ్డు ఆక్రమణలపై కొరడా ఝుళిపించారు.బుధవారం లక్ష్మీగూడ నుంచి వాబే కాలనీ కార్గో రోడ్డు వెంబడి రోడ్డు ఇరువైపులా ఫుట్పాత్ల ఆక్రమణలను జెసిపిల సహకారంతో తొలగించారు.సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె.రవికుమార్ ఆదేశాల మేరకు జిహెచ్ఎంసి అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీధర్ బృందం, మైలార్ దేవులపల్లి పోలీసులతో కలిసి ఈ కూల్చివేతలను చేపట్టారు.భారీ బందోబస్తు నడుమ ఫుట్పాత్ అక్రమణలను నెలమట్టం చేశారు.ఈ నేపథ్యంలో స్థానికులకు,అధికారులకు మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది.అధికారితో వాగ్వివాదానికి దిగి,విధి నిర్వహణలో ఉన్న అధికారులపై ప్రజలు నానా హంగామా సృష్టించారు.పోలీసులు కూల్చివేతలకు అడ్డుగా వస్తున్న వారిని పక్కకు పంపించి యధావిధంగా కూల్చివేతలను కొనసాగించారు.ఈ సందర్భంగా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె.రవికుమార్



లక్ష్మీగూడలో ఫుట్ పాత్‌పై అక్రమణల తొలగింపు

మాట్లాడుతూ... లక్ష్మిగూడ నుంచి వాంబే కాలనీకి వెళ్లే రోడ్డుకు ఇరువైపుల ఫుట్పాత్లు పూర్తిగా ఆక్రమణలకు గురైయ్యాయన్నారు.దీంతో వాహనాదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.గంటల తరబడి ట్రాఫిక్ లో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు.దీన్ని దృష్టిలో ఉంచుకోని ఫుట్పాత్లను ఆక్రమించిన వాటిని పూర్తిగా నెలమట్టం చేశామన్నారు.మరోసారి ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.మరికొన్ని నిర్మాణాలకు కూడా రెండు రోజుల సమయం ఇచ్చామని ఆ రెండు రోజుల్లో వారంతట వారే కూల్చి వేసుకుంటే మంచిదని లేకుంటే మరోసారి కూల్చివేతలు తప్ప ఉన్నారు.కూల్చివేసిన స్థానంలో మరోసారి డబ్బాలు నిర్మాణం చేస్తే క్రిమినల్ కేసులను చేస్తామని హెచ్చరించారు.

**కూల్చివేతలకు సమయం ఇవ్వాలి..రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్.**

మైలార్ దేవులపల్లి డివిజన్ లక్ష్మీ గూడలో జరుగుతున్న ఫుట్పాత్ల తొలగింపు విషయాన్ని తెలుసుకున్న రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ సంఘటన స్థలానికి చేరుకున్నారు.ఈ సందర్భంగా స్థానికులు,అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడారు.ఫుట్పాత్ల అక్రమణల తొలగింపు కోసం సమయం ఇవ్వాలన్నారు.ఇప్పటికప్పుడు తొలగిస్తామంటే వారు వారి సమాన్లు ఎక్కడ పెట్టుకుంటారన్నారు.తగిన సమయం ఇస్తే వారే వాటిని తొలగించుకుంటారని తెలిపారు.

# అపర్ణ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీకి నోటీసులు

గండిపేట్,డిసెంబర్18(ప్రభాత ఉదయం) మణికొండ మున్సిపాలిటీలో శ్రీరామ్ నగర్ పరిధిలో అపర్ణ స్కూల్ ఆఫ్ ఎక్స్ లెన్సీ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న స్కూల్ స్కూల్ యాజమాన్యంకు నోటీసులు ఇచ్చినట్లు మండల విద్యాశాఖ అధికారి విజయ్ కుమార్ కుమార్ తెలిపారు.ఈ మేరకు పోలీసులు స్కూల్ యాజమాన్యం తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు.నిబంధనలు ప్రకారం గ్రౌండ్ ఫ్లోర్ ప్లస్ అప్పర్ 2 ఫ్లోర్ అనుమతులే ఉండగా స్కూల్ యాజమాన్యం అదనంగా మరో భారీ షెడ్ నిర్మాణం చేపట్టారన్నారు.దీంతో కంగు తిన్న కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు.ఈ కాలనీలో ఒక ప్లే స్కూల్ తరగతి గదిలో ఏసీ రూమ్ లో షాక్సరిట్ వల్ల విద్యార్థులు ఇబ్బంది పడ్డారని,స్కూల్ యాజమాన్యం సెల్లర్ లో క్లాస్ నడిపిస్తూ విద్యార్థులు ఇబ్బందులు పెడుతున్నారన్నారు.ఏది ఏమైనా విద్యార్థులు స్కూల్ లో చాలా ఇబ్బందులు పడుతున్నారని వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని స్కూల్ యాజమాన్యం ధన దాహానికి విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారన్నారు. మణికొండ మున్సిపల్ కమిషనర్ కూడా ఈ స్కూల్ యాజమాన్యంపై షెడ్ నిర్మాణంపై నోటీస్ జారీ చేయాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి పాఠశాల ఏర్పాటుకు ముందు అగ్నిమాపకశాఖ నుంచి ఫైర్ సర్టిఫికెట్ పొందాలన్నారు. సంబంధిత శాఖ అధికారులు అనుకూలతను పరిశీలించి అనువుగా ఉంటేనే ధ్రువీకరించాలని,కానీ కొన్ని నిబంధనలకు అనుగుణంగా లేకపోయినా రాజకీయ ఒత్తిళ్లు,పలుకుబడితో అటు,ఇటుగా ఉన్నా అనుమతులు ఇచ్చారనే ఆరోపణలు కూడా ఉన్నాయి.తరువాత రెన్యువల్ సమయంలో కూడా కేవలం పేపర్ల ఆధారంగానే సర్టిఫై చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. అపార్టుమెంట్లు,ఇరుకైన సముదాయాల్లో పాఠశాలలను నిర్వహిస్తున్నట్లు తమ దృష్టికి వస్తే పరిశీలిస్తామన్నారు.నిబంధనలు పాటించకుండా పాఠశాలలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని,ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఎవరు కూడా పాఠశాలలను నిర్వహించకూడదని సూచించారు.







# తెలంగాణ నూతన హైకోర్ట్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు మంజూరు

**100 ఎకరాల్లో తెలంగాణ నూతన హైకోర్ట్..**
**రూ.2583 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు..**
**వచ్చేనెలలో టెండర్లు**

రాజేంద్రనగర్,డిసెంబర్ 18(ప్రభాత ఉదయం) తెలంగాణ నూతన హైకోర్ట్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. హైదరాబాద్ నగర శివారులోని రాజేంద్రనగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన100 ఎకరాల్లో ఈ నూతన హైకోర్ట్ ను నిర్మించనున్నారు.దీని నిర్మాణానికి మొత్తం రూ.2583 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.ఇందులో సివిల్ పనుల కోసం రూ.1980 కోట్లు,మిగిలిన పనుల కోసం రూ.603 కోట్లు ఖర్చు చేయనున్నారు. కాగా ఈ పనుల నిర్మాణాలకు వచ్చేనెలలో టెండర్లు పిలవనున్నట్టు సమాచారం.

# శబరిమల దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదం

**రాజేంద్రనగర్ చెందిన ఇద్దరు వ్యక్తులు దుర్మారణం**


డాక్టర్ పోతన్న


డాక్టర్ సీతారం నాయక్

రాజేంద్రనగర్, డిసెంబరు18(ప్రభాత ఉదయం): శబరిమల దైవ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా తమిళనాడులో జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజేంద్రనగర్ చెందిన ఇద్దరు వ్యక్తులు దుర్మారణం చెందారు. ఒకరికి కి తీవ్ర గాయాలు కాగా ఇంకొకరు గాయాలతో ఆసుపత్రిలో చేరారు. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. బాబుల్ రెడ్డి నగర్ ప్రాంతానికి చెందిన ఆర్ ఎం పీ డాక్టర్ పోతన్న (50 ) బుద్వేల్ రైల్వే స్టేషన్ కు చెందిన ఆర్ ఎం పీ డాక్టర్ సీతారాం నాయక్(50), తో పాటు ఆయన కుమారుడు చరణ్, స్నేహితుడు శ్రీరామ్ నగర్ కు చెందిన శివకుమార్ గౌడ్ (50) తో కలిసి ఈనెల 16న తమ సొంత కారు లో శబరిమల అయ్యప్ప స్వామి దర్శనానికి వెళ్లారు . దర్శనం చేసుకుని తిరిగి వస్తుండగా బుధవారం తెల్లవారు జామున తేనీ దేవదాన తట్టి అనే ప్రాంతం లో ఎదురుగా వెళ్తున్న బొలెరో వాహనానికి ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో డాక్టర్ పోతన , డాక్టర్ సీతారాం నాయక్ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. శివకుమార్ గౌడ్ కు తీవ్ర గాయాలయ్యాయి. చరణ్ మదురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బుద్వేల్ రైల్వే స్టేషన్ ప్రాంతం నుంచి స్థానిక నాయకులు దత్తు తో పాటు పదకొండరు తమిళనాడుకు బయలుదేరి వెళ్లారు.



# ఎఫ్‌డిసి ఛైర్మన్‌గా దిల్‌రాజ్ బాధ్యతలు

**అభినందనలు తెలిపిన మంత్రి కోమటిరెడ్డి**

**హైదరాబాద్, డిసెంబర్ 19 (ప్రభాత ఉదయం):** రాష్ట్ర చలన చిత్ర అభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా దిల్‌రాజు బుధవారం ఉదయం పదవీ భాధ్యతలు స్వీకరించారు. మాసాబ్ ట్యాంక్ లోని ఎఫ్.డీ.సి కార్యాలయంలో వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య పదవీ భాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కార్యక్రమానికి హాజరై దిల్ రాజ్ ను అభినందించారు. తెలంగాణా లో ఫిలిం ఇండస్ట్రీ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. తెలుగు చలన చిత్ర పరిశ్రమకు, రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ఇండస్ట్రీకి చెందిన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వడంలో దిల్ రాజు సేవలు ఎంతగానో ఉపయోగపడతాయాని ఈ సందర్భంగామంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీ కి చెందిన షూటింగ్స్ తెలంగాణా లో మరింత ఎక్కువగా జరిగే విధంగా ప్రయత్నిస్తానని కృషి చేస్తానని దిల్ రాజ్ పేర్కొన్నారు.

# అరెస్ట్ కోసం కెటిఆర్ తహతహ

**ఎంపి చామల హాట్ కామెంట్స్**

**హైదరాబాద్, డిసెంబర్ 19 (ప్రభాత ఉదయం):** ఫార్ములా ఈ కార్ రేస్ వ్యవహారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అరెస్ట్‌కు రంగం సిద్ధమైందని.. మరో రెండు, మూడు రోజుల్లో పోలీసులు ఆయనను అరెస్ట్ చేస్తారని తెలంగాణ రాజకీయాల్లో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో కేటీఆర్ అరెస్ట్‌పై అధికార కాంగ్రెస్ పార్టీ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎప్పుడు అరెస్టు చేస్తారని కేటీఆర్ ఎదురు చూస్తున్నాడు.. ఆయనకు అరెస్టు కావాలనే ఇంట్రెస్ట్ చాలా ఎక్కువగాప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నాడని ఫైర్ అయ్యారు. ప్రభుత్వం మీద విష ప్రచారం చేస్తూ కేసులు పెట్టించుకోవాలనే భావనలో ఆయన ఉన్నారని.. అరెస్టయి ట్రెండింగ్‌లోకి రావాలని కేటీఆర్ భావిస్తున్నట్టు ఉన్నాడన్నారు. ఎవరైనా సరే చట్టం తన పని తాను చేసుకుపోతుందని అన్నారు.



# గండిపేట్ ఎఫ్‌టీఎల్ నిర్ధారణలో అక్రమాలు గుర్తించిన హైడ్రా

గండిపేట్,డిసెంబర్ 18(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ గండిపేట్ ఎఫ్‌టీఎల్ నిర్ధారణలో అక్రమాలు జరిగినట్లు నీటిపారుదల శాఖ,హైడ్రా అధికారుల తనిఖీల్లో వెలుగుచూసింది. ఆక్రమణదారులకు సహకరిస్తూ ముగ్గురు నీటిపారుదల శాఖ అధికారులు ఎఫ్‌టీఎల్ మ్యాప్‌లో మార్పులు చేసినట్లు గుర్తించారు.ఈ మేరకు సదరు అధికారులపై చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రభుత్వానికి హైడ్రా సిఫారసు చేసింది. ఉస్మాన్‌సాగర్ ఎఫ్‌టీఎల్‌లో చోటుచేసుకున్న మార్పులను సరిదిద్దుతున్నట్లు హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు.



# సులేమాన్ నగర్ డివిజన్ బిఆర్ఎస్ కమిటీ అధ్యక్షులు మహమ్మద్ జహీరుద్దీన్

**నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపిన పి.కార్తీక్ రెడ్డి**

రాజేంద్రనగర్,డిసెంబర్18(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ నియోజకవర్గంలో భారతీయ రాష్ట్ర సమితి పార్టీని బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాష్ట్ర బీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు పి.కార్తీక్ రెడ్డి అన్నారు.నియోజకవర్గంలో పార్టీ బలంగా ఉందని ఆయన వ్యాఖ్యానించారు.బుధవారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని సులేమాన్ నగర్ డివిజన్ నూతన కమిటీని ప్రకటించారు.ఈ నూతన కమిటీ అధ్యక్షులు మహమ్మద్ జహీరుద్దీన్,ఉపాధ్యక్షులు సయ్యద్ అమీర్,షేక్ అమీర్,ప్రధాన కార్యదర్శి ఎండీ అబ్దుల్ రెహమాన్,సంయుక్త కార్యదర్శి ఎండీ ఇబ్రహీం,ఎండీ మహబూబ్,కార్యదర్శిలు ఎండీ మక్బూల్,ఎండీ దావత్ సాష,ఎండీ అష్రఫ్,స్పోక్స్ పర్సన్ సయ్యద్ షానవాజ్,ఎగ్జిక్యూటివ్ సభ్యులు ఎండీ ఆజం,ఎండీ సలీం,ఎండీ జాకీర్,ఎండీ సర్వర్,ఎండీ ఫయాజ్,ఎండీ మొయిజ్ ఖాన్,ఎండీ అబ్దుల్ లయిక్,దస్తగీర్, జుబేర్, అజీమ్, ఖాదర్‌లు ఎన్నికయ్యారు.ఈ మేరకు కార్తీక్ రెడ్డిని నూతన కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి పూలబోక్కేను అందించారు.ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు కార్తీక్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం ఆయన మాట్లాడుతూ...పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ శ్రమించాలని అన్నారు.నూతన కమిటీ అందరినీ కలుపుకొని పోతూ టీఆర్ఎస్ ను బలోపేతం చేయాలని సూచించారు.అనంతరం నూతన అధ్యక్షులు మాట్లాడుతూ..తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్టానానికి ధన్యవాదాలు తెలిపారు.బీఆర్ఎస్ పార్టీ బలోపేతమే తన ప్రధాన ఏజెండాగా పనిచేస్తానని ఆయన వివరించారు.


అసిస్టెంట్ ఇంజనీర్ రవీందర్ నూతన కార్యదర్శి అజీమ్‌లను ఉద్యోగులు

# గగన్ పహాడ్ ఏఈ రవీందర్‌ను కలిసిన నూతన 1104 యూనియన్ కార్యదర్శి అజీమ్

రాజేంద్రనగర్, డిసెంబర్ 18(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ విద్యుత్ డివిజన్ ఉద్యోగుల 1104 యూనియన్ కార్యదర్శిగా మరోసారి ఎన్నికైన మహమ్మద్ అజీమ్ బుధవారం మర్యాదపూర్వకంగా గగన్ పహాడ్ అసిస్టెంట్ ఇంజనీర్ రవీందర్ను కలిశారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ఇంజనీర్ రవీందర్, నూతన కార్యదర్శి మహమ్మద్ అజీమ్ ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఫోర్ మెన్ గౌస్, లైన్ ఇన్స్పెక్టర్ తాజుద్దీన్, శ్రీశైలం, మహేష్, శివ ప్రసాద్ లు పాల్గొన్నారు.




# ప్రార్థన మందిరాలలో సీసీటీవీలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలి

**ఒక సీసీ కెమెరా వంద మంది పోలీస్ సిబ్బందితో సమానం**

**బాలానగర్ సీఐ నర్సింహా రాజు**

కూకట్‌పల్లి,డిసెంబర్ 18 (ప్రభాత ఉదయం) నేరాల నియంత్రణలో సీసీటీవీలు కీలకంగా వ్యవహరిస్తాయని బాలానగర్ సీఐ నర్సింహా రాజు పేర్కొన్నారు. బుధవారం బాలానగర్ డివిజన్ పరిధిలోని 120 డివిజన్ పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులతో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో బాలానగర్ పరధిలోని 14 చర్చ్ పాస్టర్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ నర్సింహా రాజు మాట్లాడుతూ సమాజ భద్రతలో భాగంగా ప్రతి చర్చ్ వారు సీసీటీవీలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఇందుకొరకు కావలసిన సాంకేతిక సహకారం అందిస్తామన్నారు. నేర నియంత్రణలో సీసీటీవీలు కీలక పాత్ర పోషిస్తాయని ఈ సందర్భంగా అన్నారు. ఒక సీసీ కెమెరా వంద మంది పోలీస్ సిబ్బందితో సమానమని, సీసీ కెమెరాల ఏర్పాటుతో దొంగతనాలు, అల్లర్లు, గొడవలు ఇతర నేరాలు సులువుగా నియంత్రించ వచ్చున్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని చర్చ్ ప్రతినిధులు ముందుకు రావాలని, విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి నియోజకవర్గ క్రిస్టియన్ మైనారిటీస్ ప్రధానకార్యదర్శి ఎన్.వి. రత్నం, బాలానగర్ పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షుడు స్వామి, పాస్టర్లు బి. శాంసన్, ఓఎంకే రాజు, జెర్రమయ్య, కె. ప్రసాద్, కె. రాజు, కృప రావు, సుందర్, సందీప్, అలెక్స్, జయప్రసాద్, ఏం. రాజు, విజయరాజు, వై.జి. కిషోర్ ఇతరులు పాల్గొన్నారు.

ప్రభాత ఉదయం



## మార్కెట్ యార్డ్ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్ కుమార్తె ఎంగేజ్మెంట్‌కు హాజరైన నాయకురాళ్ళు

కొత్తకోట, డిసెంబర్ 18(ప్రభాత ఉదయం)మున్సిపాలిటీ కేంద్రంలో మదనపురం మార్కెట్ యార్డ్ చైర్మన్, టీపీసీసీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు పల్లెపాగు ప్రశాంత్ కుమార్తె ఎంగేజ్మెంట్ జరిగింది. ఈ కార్యక్రమానికి దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి సతీమణి కవిత మధుసూదన్ రెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులుహాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.



## పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే విడుదల చేయాలి

గద్వాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్18(ప్రభాత ఉదయం) ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే స్కావెంజర్లకు పెండింగ్లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పేర్ నరసింహ డిమాండ్ చేస్తూ బుధవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ బిఎం సంతోష్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా,ఒక్కో పాఠశాలకు ఒక్కో విధంగా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని తెలిపారు. ఈ నిధులతోనే ఒక్కో పాఠశాలలో ఇద్దరు, ముగ్గురు కార్మికులను అతి తక్కువ వేతనాలకు నియమించుకున్నారని అన్నారు. ఈ సంవత్సరం ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన, ఇప్పటివరకు కార్మికుల ఖాతాలో జమ చేయలేదని అన్నారు స్కావెంజర్లకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు చెల్లించిన తక్కువే అవుతుందని ,అటువంటిది ఇచ్చే అతి తక్కువ వేతనాన్ని కూడా నెలల తరబడి పెండింగ్ లో పెడితే వాళ్ళ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. స్కావెంజర్లకు రక్షణగా ఎటువంటి పరికరాలను కూడా అందజేయలేదని, దీనివల్ల కార్మికులు తరచుగా అనారోగ్యాల పాలు అవుతున్నారని అన్నారు. కార్మికులు చేస్తున్న కష్టాన్ని దృష్టిలో ఉంచుకొని వెంటనే పెండింగ్ లో ఉన్న వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా గత సంవత్సరం కూడా కార్మికులు పాఠశాలల్లో పని చేసినప్పటికీ స్థానిక సంస్థలు వేతనాలు చెల్లించలేదని,గత ఏడాది వేతనాలు కూడా వెంటనే విడుదల చేయాలని కోరారు. స్కావెంజర్లకు ఫిక్స్ డే వేతనాన్ని నిర్ణయించాలని, నెల నెల సక్రమంగా వేతనాలు చెల్లించాలని, లేనిపక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళనలకు సిద్ధం అవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రఘు, పార్వతి, చంద్రశేఖర్, మాధవి, రామాంజనేయులు, ఆసియా బేగం, మజురంబి,గోవిందు, షఫీ,తదితరులు పాల్గొన్నారు.



## ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షునిగా మేడిశెట్టి బాలస్వామి

గద్వాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 18(ప్రభాత ఉదయం)జిల్లా కేంద్రంలోని కన్యకా పరమేశ్వరి దేవాలయం నందు బుధవారం తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ జిల్లా కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల పరిశీలకులుగా మిడిదొడ్డి శ్యాంసుందర్, ఎన్నికల అధికారిగా బీమా ప్రభాకర్ వ్యవహరించారు. జిల్లా అధ్యక్షులుగా మేడిశెట్టి బాలస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో గద్వాల పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఆలూరు బిలకంటి రాములు, ప్రధాన కార్యదర్శి నరహరి శ్రీనివాసులు, గౌరవ అధ్యక్షులు నందిమల్ల సురేష్ జిల్లా ప్రధాన కార్యదర్శి సి.రమేష్, కోశాధికారి ఎల్లూరి రామ్మోహన్, అదనపు ప్రధాన కార్యదర్శి ఓరుగంటి శ్రీనివాసులు, ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.




## భారతదేశ ఆస్తులను ఆదాని కొలగొట్టాడు

### నెక్లెస్ రోడ్ ఇందిరా గాంధీ విగ్రహం నుండి రాజ్ భవన్ వరకు ధర్నా విజయవంతం... శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్

కూకట్‌పల్లి,డిసెంబర్ 18 (ప్రభాత ఉదయం) ఏఐసీసీ పిలుపుమేరకు టీపీసీసీ ఆధ్వర్యంలో చేపట్టిన చలో రాజ్ భవన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం నెక్లెస్ రోడ్డులో ఉన్న ఇందిరా గాంధీ విగ్రహం వద్ద నుండి రాజ్ భవన్ వరకు చేపట్టిన ధర్నా కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రి దుద్దిల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, దామోదర్ రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వర్ రావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి సీతక్క కొండ సురేఖ, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ దీప దాస్ మున్షి, టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ గ్రేటర్ హైదరాబాద్ నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, రాష్ట్ర/నియోజకవర్గ నాయకులతో కలిసి శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్ పాల్గొన్నారు.

# కేటీఆర్‌పై కుట్రలు పన్నుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

## అక్రమ కేసులు బనాయిస్తే... రాష్ట్రం అగ్నిగుండమే



గద్వాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 18(ప్రభాత ఉదయం)తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజల్లో చైతన్యం నింపేందుకు నిత్యం ప్రయతిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై రేవంత్‌రెడ్డి సర్కార్ కక్ష పెంచుకుందని కేటీఆర్ మీద అక్రమ కేసులు బనాయిస్తే తెలంగాణ రాష్ట్రం అగ్నిగుండంగా మారుతుందని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు డా.కురువ విజయ్ కుమార్ హెచ్చరించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... హైద్రాబాద్‌ను ప్రపంచపటంలో నిలబెట్టడం కోసం అంతర్జాతీయంగా జరిగిన బిడ్డింగ్ లో ఫార్ములా ఈ ఈవెంట్ ను కష్టపడి మాజీ మంత్రి కేటీఆర్ హైద్రాబాద్ తీసువచ్చారన్నారు. ఫెడరేషన్ ఇంటర్నేషనల్ ఆటో ప్రమోటర్,తెలంగాణ ప్రభుత్వానికి ఈ సంస్థకు మధ్య నాలుగేళ్ళ ఒప్పందం జరిగిందన్నారు.. హైద్రాబాద్ బ్రాండ్ ఇమేజ్ కోసం ఈవి పెట్టుబడులకోసం మిగతా క్రీడోత్సవాలు, ఇన్వెస్ట్మెంట్ సమ్మిట్స్ లగే ప్రభుత్వమే ఫండింగ్ చేద్దామని ఆనాడు రాష్ట్ర ప్రభుత్వమే స్పాన్సర్ ప్రమోటర్ గా ఉండేందుకు ఆనాడు మున్సిపల్ మంత్రిగా కేటీర్ తన శాఖ అధికారులతో కలిసి ఒక ప్రభుత్వంగా నిర్ణయం తీసుకున్నారన్నారు. 6 గ్యారెంటీలతో ప్రజలను మోసం చేసి అడ్డదారిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాడి ఒక సంవత్సరం పూర్తి అయిందన్నారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో సిఎం రేవంత్ రెడ్డి తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలను బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా %ఖు=% అనునిత్యం ఎండగడుతూ పోరాడుతున్నాడని గుర్తు చేశారు. రైతులకు 2 లక్షల రుణమాఫి చేస్తామని రైతులను మోసం చేసిన సిఎం రేవంత్ రెడ్డిని నిలదీశాడని, హైడ్రా పేరిట హైద్రాబాద్ ను అల్లకల్లోలం చేసి ఎంతోమంది పేదల ఇళ్లను కూల్చి వారిని రోడ్డున పడేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసాడ నెపంతో మాజీ మంత్రి కేటీఆర్ పై కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలను పన్నిందన్నారు. లగచర్ల లో అమాయక గిరిజన రైతుల భూములను అడ్డదారిలో లాక్కోవడానికి ప్రయత్నిస్తే అక్కడి రైతులు అధికారులను ప్రశ్నిస్తే వారిపై అక్రమ కేసులు పెట్టి జైళ్లకు పంపించిన సిఎం రేవంత్ రెడ్డి అతను సోదరులు చేసిన కుట్రలను ఛేదించి లగచర్ల సమస్యను దేశం ముందు నిలబెట్టి రేవంత్ రెడ్డిని దోషిగా నిలబెట్టాడు గుర్తు చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇంట్లో జరిగిన ఈడీ దాడులను బయటకు రాకుండా హైద్రాబాద్ కోహినూర్ హోటల్ లో పొంగులేటి అదానీ ల రహస్య చీకటి భేటీని కేటిఆర్ బయట పెట్టాడని తెలిపారు. ఇలా కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గడిచిన సంవత్సర కాలంగా చేస్తున్న అవినీతి అక్రమాలను,కుంభకోణాలను స్కాములను బయటపెట్టి ప్రజలముందు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని ఎప్పటికప్పుడు ఎండగడుతూ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం పై పోరాడిన కేటీర్ మీద కాంగ్రెస్ పార్టీ బీజేపీ పార్టీ కూడా బలుక్కొని అక్రమంగా ఫార్ములా ఈ రేసులో ఎదో అవినీతి జరిగింది అని కుట్ర పూరితంగా వ్యవహరిస్తూ ఏసీబీ కేసులు పెడతామని కేటీర్ గొంతును నొక్కాలని వ్యవహరిస్తే కచ్చితంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. ముఖ్యంత్రి రేవంత్ రెడ్డి ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిన దొంగ కాబట్టి కేటీఆర్ కూడా ఏసీబీ లో ఎదో ఒకరకంగా అక్రమంగా కేసులు పెట్టాలని చూస్తే తెలంగాణ రాష్ట్రం అగ్నిగుండం అవుతుంది అని ఈ సందర్బంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై తీవ్ర స్థాయిలో విరుచుకపడ్డారు. ఈకార్యాక్రమంలో నాయకులు మల్దకల్ నాయుడు,మంద మల్లికార్జున్,ఆటో మఖ్బుల్,బీచుపల్లి, నర్సింలు, రాము, బాలస్వామి, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.




## సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

గద్వాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 18(ప్రభాత ఉదయం) భవిష్యత్‌కు చదువు ఎంతో ఉపయోగమని, అలాంటి విద్యాశాఖలో ఏళ్లుగా పని చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె బుధవారంతో తొమ్మిదవ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా ఉద్యోగులు జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తాలో మానవహారంగా ఏర్పడి నిరసన తెలియజేశారు. అనంతరం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి వినతి పత్రం అందజేశారు. జిల్లా కేంద్రంలో చేపట్టిన దీక్ష శిభిరానికి బీఆర్ఎస్ నాయకులు వెళ్లి మద్దతు పలికారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు విజయ్ కుమార్ మాట్లాడుతూ... చాలా కాలంగా విద్యాశాఖలో పని చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పలు శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించామన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్ల వేతనాలు పెంచామని, కేజీబీవీ ఉద్యోగులకు న్యాయం చేశామన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం తీర్చేవరకు సమ్మె విరమించవద్దని, అప్పటి వరకు తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, అయిజ ఎంఇఓ రాము, రిటైర్డ్ ఎంఇఓ బసవరాజ్, ఉపాధ్యాయులు వెంకటస్వామి, శర్మ, కేజిబివి ఎస్ఓలు, సీఆర్టీలు, పీజీ సీఆర్టీలు, సమగ్ర శిక్ష ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



ఏడిఈ రమేష్‌ను కలిసిన వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్

## ఏడిఈ రమేష్‌ను కలిసిన నూతన 1104 యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్

శంషాబాద్, డిసెంబర్ 18(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ విద్యుత్తు డివిజన్ 1104 ఉద్యోగుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎన్నికైన శ్రీనివాస్ బుధవారం మర్యాదపూర్వకంగా శంషాబాద్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ రమేష్ ను కలిశారు. ఈ సందర్భంగా ఏడీఈ రమేష్ నూతన వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ విద్యుత్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ భాష, రామ్ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.




మీడియాతో మాట్లాడుతున్న జయప్రకాష్ నారాయణ

## ప్రాణాలను కాపాడి జీవితాలను నిలబెట్టే విద్య నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది: జయప్రకాశ్ నారాయణ

### జనత హృదయాలయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు హనుమంత రెడ్డిని అభినందించిన జయప్రకాష్ నారాయణ

శంషాబాద్. డిసెంబర్ 18( ప్రభాత ఉదయం) ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడి ప్రాణాలను నిలబెట్టే విద్యా ప్రతి ఒక్కరు నేర్చుకోవాల్సిన అవసరం ఎంత ఉన్నదని మాజీ ఐఏఎస్ ఆఫీసర్. డాక్టర్ జయప్రకాష్ నారాయణ సూచించారు. జనతా హృదయాలయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ మల్ రెడ్డి హనుమంత రెడ్డి. డాక్టర్ మేథిని రెడ్డి ఆధ్వర్యంలో శంషాబాద్ లోని ఎంఎంఆర్ గార్డెన్ లో బుధవారం ఏర్పాటు చేసిన లెర్న్ సిపిఆర్. సేవ్ లైఫ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో పాటు వివిధ రంగాల వారికి సిపిఆర్ పై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ చదవడం అంటే బట్టి పట్టి. కాపి కొట్టి మార్కులు సంపాదించడం ముఖ్యం కాదు. జీవితానికి పనికి వచ్చే స్కిల్ డెవలప్మెంట్ విషయాలను నేర్చుకోవాల్సిన అవసరం ఉన్నదని సూచించారు. సి పి ఆర్ పై అవగాహన పెంచుకోవడం వలన గుండెపోటు లక్షణాలు ఉన్నవారిని కాపాడే అవకాశం లభిస్తుందని అన్నారు. సమాజానికి ఉపయోగపడే మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్న డాక్టర్ మల్రెడ్డి హనుమంత్ రెడ్డి. మల్ రెడ్డి మేతిని రెడ్డి మీ ఆయన అభినందించారు. ఆయన పుట్టి పెరిగిన ప్రాంతంలో గుండెపోటు మరణాలు సంభవించవద్దని కోరుకోవడం ఎంతో అభినందనీయమని అన్నారు.. ఈ కార్యక్రమంలో డాక్టర్ హనుమంత రెడ్డి తో పాటు డాక్టర్ డాక్టర్ ప్రేమ్ రాజ్ యాదవ్. మున్సిపల్ చైర్ పర్సన్ కొలను సుష్మా మహేందర్ రెడ్డి. కౌన్సిలర్లు మేకల వెంకటేష్ ముదిరాజ్. దేవరంపల్లి బుచ్చిరెడ్డి. మాజీ సర్పంచ్ జగన్ గౌడ్. కూచిరెడ్డి శంకర్ రెడ్డి. జగ్గీవన్ రెడ్డి.సంతోష్ రెడ్డి. ఆవుల శ్రవణ్.మునగాల రాజిరెడ్డి.తదితరులు పాల్గొన్నారు. దాదాపు పదివేల మంది విద్యార్థులకు సిపిఆర్ పై అవగాహన కల్పించారు.

## అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి



### జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్

గద్వాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 18(ప్రభాత ఉదయం) మున్సిపాలిటీలకు వచ్చే ఆదాయాలను పక్కాగా నిర్వహించి, అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్ అధికారులకు ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గద్వాల, ఐజ, అలంపూర్, వడ్డేపల్లి మున్సిపాలిటీలకు మంజూరైన నిధులు, వాటి ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులపై సమీక్షించారు. 15వ ఫైనాన్స్, సీఎం అష్యూరెన్స్ ఫండ్, పన్నులు, గృహ నిర్మాణ అనుమతులు, ఎల్ఆర్ఎస్ ద్వారా వచ్చిన ఆదాయాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వచ్చిన ఆదాయాన్ని సరైన అకౌంటింగ్ ప్రక్రియలతో నిర్వహించి, చార్టెడ్ అకౌంటెంట్ల ద్వారా ఎప్పటికప్పుడు ఆడిట్ చేయించాలన్నారు. నిధులను ఇతర పనులకు మళ్లించకుండా పద్ధతి ప్రకారం ఖర్చు చేయాలని ఆదేశించారు. అభివృద్ధి పనుల వేగవంతం వివిధ స్కీముల నుండి వచ్చిన నిధుల ద్వారా చేపట్టిన పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా స్వచ్ఛ భారత్ నిధుల కింద చేపట్టిన మరుగుదొడ్లు,పబ్లిక్ టాయిలెట్స్, కమ్యూనిటీ టాయిలెట్స్ నిర్మాణ పనుల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. చేపట్టిన పనులను త్వరలోనే క్షేత్రస్థాయిలో పరిశీలిస్తానని, పనులకు సంబంధించిన పూర్తి వివరాలతో సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. వచ్చే వారం వరకు నిధుల వివరాలను సమగ్రంగా అందజేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు, మున్సిపల్ కమిషనర్లు, డిఇలు, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.